క్లుప్తంగా

28 నుంచి వేసవి చిత్రకళా తరగతులు

వినుకొండ: జెస్టిస్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ జయతి హాస్పిటల్ పక్కన యూటీఎఫ్ కార్యాలయంలో ఈ నెల 28వ తేదీ నుంచి వేసవి చిత్రకళా తరగతులు నిర్వహించనుంది. ఈ మేరకు అకాడమీ డైరెక్టర్, చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ తెలిపారు. వివరాలకు 98484 69694 ఫోను నంబరులో సంప్రదించాలన్నారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు



నూజెండ్ల: వృత్తి విద్యా కోర్సుల ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు ఉంటాయని జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని పాఠశాలలో పదో తరగతి పాసైన విద్యార్థులకు గురువారం వృత్తి విద్యా ఇంటర్న్‌షిప్ ధ్రువపత్రాలు అందజేశారు. పది రోజులపాటు రిటైల్, అపెరల్, హెల్త్‌కేర్ కోర్సులలో శిక్షణ ఇచ్చామని చెప్పారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



నాదెండ్ల: క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించినపుడే శాంతియుత సమాజం నిర్మితం అవుతుందని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ ఎస్సీ కాలనీలో సెవెన్త్ డే ఎడ్వంటిస్ట్ చర్చ్ ప్రహరీని గురువారం ఆయన ప్రారంభించారు. రూ.8 లక్షలు ఆయన వితరణ చేసి ప్రహరీ, టాయిలెట్లు ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ పరిశుద్ధరావు, నాయకులు యన్నం శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరికృష్ణకు పీహెచ్‌డీ ప్రదానం



నాదెండ్ల: గణపవరం శ్రీ చుండి రంగనాయకులు ఇంజినీరింగ్ కళాశాల మాజీ వైస్ ప్రిన్సిపల్ ఎన్. హరికృష్ణ పీహెచ్‌డీ పట్టా పొందారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నావెల్ ఆల్గారిథమ్ ఫర్ ఎన్‌హాన్స్‌డ్ సెక్యూరిటీ ఇన్ సీక్రెట్ కీ జనరేషన్ త్రూ కాంప్రెహెన్సివ్ క్వాంటం క్రిప్టోగఫీ ప్రోటోకాల్ అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకుగాను పీహెచ్‌డీ వచ్చింది. గైడ్‌గా రామినేని శివరామ ప్రసాద్ వ్యవహరించారు.

ఆర్థిక స్వావలంబన అవసరం

నాదెండ్ల: ప్రభుత్వం అందిస్తున్న చేయూతను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. సాతులూరు గ్రామంలో బీసీ మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు.

పశువుల దాహార్తి తీర్చేలా నీటి తొట్లు

నూజెండ్ల: వేసవిలో పశువులు, జీవాల దాహార్తిని తీర్చటానికి ఉపాధి హామీ పథకం ద్వారా ఏర్పాటు చేసిన నీటి తొట్లు ఉపయోగపడతాయని ఏపీవో ఆంజనేయరాజు అన్నారు. మండలానికి 9 తొట్లు మంజూరు కాగా, 7 నిర్మాణం పూర్తిచేసుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసరావుపేట: పట్టణంలో శుక్రవారం మరమ్మతులు నిమిత్తం శ్రీనివాసనగర్, సాంబశివరావుపేట, వినుకొండ రోడ్డు, కోటప్పకొండ రోడ్డు, తొమ్మిదో వార్డు ఏరియాలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు డీ2 సెక్షన్ ఏఈ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వినుకొండ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్



వి.పద్మ

వినుకొండ: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు వి.పద్మకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. తెలుగు ప్రాచ్య భాషా విభాగాధిపతి ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు పర్యవేక్షణలో సలీం కథా సాహిత్యానుశీలన అనే అంశంపై చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 2005లో ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా చేరిన ఆమె డాక్టరేట్ సాధించాలనే లక్ష్యంతో చదువును కొనసాగించారు. వి.పద్మ డాక్టరేట్ సాధించడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి
- న్యాయం చేయకపోతే పోరాటానికి సిద్ధం
- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

శావల్యాపురం: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గంటావారిపాలెం గ్రామం టీడీపీ నేతలు ఎస్టీ కాలనీలో ఈ నెల 19న కాలనీలో ఉన్న చికెన్, కిరాణా దుకాణాలు కూల్చి వేసిన ప్రాంతాన్ని గురువారం ఆయన పరిశీలించారు. బాధితులను అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన వారిపై ఇష్టానుసారంగా దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 19న రాత్రి సమయంలో ఎస్టీ కాలనీకి చెందిన పులి జ్యోతి, కుంభ సుజాతలకు చెందిన చికెన్, కిరాణా దుకాణాలను టీడీపీ నేతలు పథకం ప్రకారం జేసీబీలు తీసుకొచ్చి కూల్చివేయటం దుర్మార్గమన్నారు. ఈ ఘటనలో రూ.18 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లిందని తెలిపారు. పులి నాగేశ్వరరావు ముఖంపై రాయితో దాడి చేశారని పేర్కొన్నారు. కుంభా సుజాత దుకాణాలను కూల్చివేస్తున్న దృశ్యాలను తన సెల్‌ఫోనులో చిత్రీకరణ చేస్తుండగా మహిళ అని కూడా చూడకుండా విచక్షణరహితంగా దాడి చేశారన్నారు. దుస్తుల్లో ఉంచిన సెల్‌ఫోను కూడా లాక్కుని టీడీపీ నేతలు దౌర్జన్యం చేశారని పేర్కొన్నారు. ఇప్పటికీ వారి సెల్‌ఫోన్లు కూడా తిరిగి ఇవ్వకపోవటం ప్రభుత్వ తీరుకు నిదర్శమన్నారు. బడుగు, బలహీన వర్గాలపై బెదిరింపులకు పాల్పడటం దారుణమన్నారు. ఇంతా జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఈపూరు మండలం బొమ్మరాజుపల్లి తండా వాసులైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ వారు దాడులకు పాల్పడితే పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిపాలన తీరును డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గమనించాలన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కూల్చివేతలకు ఉపయోగించిన జేసీబీలను సీజ్ చేయాలన్నారు. రెండు రోజుల వ్యవధిలో బాధిత కుటుంబాలకు న్యాయం జరగకపోతే ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా అధికార ప్రతినిధి, ప్రముఖ న్యాయవాది ఎంఎస్ ప్రసాదు, చిలూకూరి లక్ష్మీనారాయణ, మలిశెట్టి నరేష్, వినుకొండ రూరల్ కన్వీనర్ దండు చెన్నయ్య, గంధం బాలిరెడ్డి, జవంగుల బాబు సుందరరావు, కాలనీవాసులు ఉన్నారు.

హోరాహోరీగా జాతీయస్థాయి ఎడ్ల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వినుకొండ: శ్రీ మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా మక్కెన చినరామయ్య ఆడిటోరియంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సబ్ జూనియర్స్ విభాగంలో ప్రకాశం జిల్లా నాగోల్‌పాడు మండలం మద్దిరాలకు చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎద్దులు 4788.90 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. హైదరాబాద్‌కు చెందిన ప్రగతి రిసార్ట్స్ ప్రీతిక రామకృష్ణ ఎడ్లు 4,775 అడుగులు లాగి 2వ స్థానం, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం పెద్దపులిపాకకు చెందిన శ్రీధర్ ఎడ్లు 4,250 అడుగులు లాగి 3వ స్థానంలో నిలిచాయి. విజేతలైన ఎడ్ల యజమానులకు దాతలు, నిర్వాహకులు నగదు బహుమతులు అందజేసి అభినందించారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ





నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వినుకొండ (నూజెండ్ల): జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల నిరసన ర్యాలీ నిర్వహించారు. వినుకొండ పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ర్యాలీని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.ఎస్.ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు కొవ్వొత్తులతో పట్టణంలోని శివయ్య స్థూపం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. బాధ్యులపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో........



సీపీఐ ఆధ్వర్యంలో...

చిలకలూరిపేట టౌన్: పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ చిలకలూరిపేటలో సీపీఐ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ, కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కళామందిర్ సెంటర్ వద్ద ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు భారీగా హాజరై మానవహారం ఏర్పాటు చేసి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా గళమెత్తారు. ఈ కార్యక్రమానికి సీపీఐ ఇన్‌చార్జి ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభానీ అధ్యక్షత వహించారు. నాయకులు ఎం.రాధాకృష్ణ, సమద్‌ఖాన్, అజారుద్దీన్, మల్లిబాబు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, మౌలాలి, అల్లాబక్షు, అబ్దుల్‌జబ్బార్, షేక్ జరీనాసుల్తానా, మిరియాల రత్నకుమారి, చెరుకుపల్లి నిర్మల, మాదాసు భానుప్రసాద్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురు జూదరులు అరెస్టు

చిలకలూరిపేటటౌన్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన ఘటన గురువారం మండలంలోని బొప్పూడి గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నలుగురు వ్యక్తులు పేకాట (లోపలబయట) ఆడుతున్నారని సమాచారం అందడంతో చిలకలూరిపేట రూరల్ ఎస్సై జి.అనిల్ కుమార్, షేక్ మహబూబ్ సుభాని సిబ్బంది సహాయంతో పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.25 వేల నగదును స్వాధీనర చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు.

కార్మిక సదస్సును జయప్రదం చేయండి

నరసరావుపేట ఈస్ట్: విజయవాడ ఎంబీ భవన్‌లో ఈ నెల 25 వ తేదీన జరగనున్న కార్మిక సంఘాల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని సీపీఐ కార్యాయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పలపాటి రంగయ్య, వైదన వెంకట్, గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

నరసరావుపేట: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించకపోతే పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అవ్వారు ప్రసాదరావు, షేక్ సిలార్ మసూద్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని గాంధీ పార్కు వద్ద ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. బత్తుల బాలకోటయ్య, రామిశెట్టి ఆంజనేయులు, జి మస్తానరావు, కొమ్ముల సురేష్ పాల్గొన్నారు.

బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని డిమాండ్



నరసరావుపేట: యానిమినేషన్ యాప్ సహా బెట్టింగ్ యాప్‌లు అన్నింటినీ నిషేధించి, బాధ్యులపై చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. బస్టాండ్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై చట్టం చేసినా ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని అన్నారు. పీడీఎం రాష్ట్ర నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, బీసీ నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పీఎఫ్ సొమ్ముకు భద్రత కల్పించాలి

నరసరావుపేట: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు గురువారం పురపాలక సంఘం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అమరారపు సాల్మన్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావుకు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులు మందపాటి వీరకుమార్, జీవరత్నం, నరసింహారావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష

చిలకలూరిపేటటౌన్: మండలంలోని మురికిపూడిలో చోటు చేసుకున్న దారుణ హత్య కేసులో నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్షను విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 జూలై 23 రాత్రి మురికిపూడిలో చికెన్ పకోడీ వ్యాపారం చేస్తున్న షేక్ ఖాదర్‌వలీ బాబా అలియాస్ బాబును బల్లికురవ మండలం వేమవరం గ్రామానికి చెందిన వడితే నాగేశ్వరనాయక్ హత్య చేశాడు. నిందితుడి సన్నిహిత మహిళతో మృతుడు స్నేహంగా ఉండటం తట్టుకోలేక, కోపంతో కత్తితో నరికి హత్య చేసినట్టు దర్యాప్తులో తేలింది. ఘటనపై బాధితుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ ఎస్సై ఎ.అనిల్‌కుమార్ కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ ఎం.సుబ్బారావు విచారణ చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు అప్పగించారు. ఈ కేసును నరసరావుపేట 13వ అదనపు జిల్లా కోర్టులో విచారించిన న్యాయమూర్తి నేతి సత్యశ్రీ, నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించారు. బాధిత పక్షాన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేశిరెడ్డి మల్లారెడ్డి వాదనలు వినిపించారు.

సాక్షి యాడ్స్ ఉద్యోగి కరుణ బాబు గుండెపోటుతో మృతి



చిలకలూరిపేట: సాక్షి దినపత్రిక చిలకలూరిపేట ఆర్సీ పరిధిలో అసిస్టెంట్ యాడ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వేల్పూరి కరుణ బాబు (46) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా, ఆయన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సుమారు 15 సంవత్సరాల కిందట సాక్షి పత్రికలో యాడ్ రిప్రజెంటేటివ్‌గా చేరిన ఆయన అసిస్టెంట్ యాడ్ ఆఫీసర్ స్థాయికి ఎదిగారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలోని ఆయన స్వగృహానికి తరలించారు. సాక్షి ఏజీఎం జి.వెంకటరెడ్డి, బీఎం టి.గోపి, సాక్షి సిబ్బంది సందర్శించి నివాళులు అర్పించారు.

'పది' ఫలితాల్లో బాలికల ప్రతిభ



పద్మనాభుని జ్యోతిర్మయి (587)



లింగాల గాయత్రి (586)



చెన్నంశెట్టి నాగలక్ష్మి (584)



కామేపల్లి నాగ రోషిణి (584)

శావల్యాపురం: పదో తరగతి పరీక్షల్లో శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికలు సత్తా చాటారు. మండల స్థాయిలో పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తెచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో పద్మనాభుని జ్యోతిర్మయి (587), లింగాల గాయత్రి (586), చెన్నంశెట్టి నాగలక్ష్మి (584) ప్రతిభ చాటారని అభినందించారు. ఉపాధ్యాయుల కృషితో మంచి ఫలితాలు సాధించటం సంతోషంగా ఉందన్నారు. జాతీయ ప్రతిభ ఉపకార వేతన పరీక్షల్లో జిల్లా స్థాయిలో 19 మంది విద్యార్థులు ఎంపిక కావటం శుభ పరిణామం అన్నారు.

మండల స్థాయిలో వేల్పూరు ఫస్ట్

మండలంలోని వేల్పూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాల ఉత్తీర్ణతా శాతంలో మండల స్థాయిలో మొదట స్థానం సాధించినట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతి రావు గురువారం తెలిపారు. 46 మందికిగాను 44 మంది పాసయ్యారని పేర్కొన్నారు. కామేపల్లి నాగ రోషిణి 584 మార్కులు సాధించి మండల స్థాయిలో తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. మానం జస్మంత్ 577, రెడ్డి హేమంత్ 556, జ్యోతి వివేకనంద 554, జగం అనూష 553, మువ్వా లక్ష్మీ హిరిత 542, సుబ్రమణ్యం 538, తలమాల శ్రావణి 512, ఎస్.మనీషా 509, బొల్లా సాయి గణేష్ 502 మార్కులు సాధించారన్నారు. కామేపల్లి నాగ రోషిణికి సైన్సు, గణితం సబ్జెక్టులో వంద మార్కులు వచ్చాయన్నారు. ఎం.జస్మంత్ గణితంలో నూరు మార్కులు సాధించాడని తెలిపారు. ఉపాధ్యాయుల కృషి వలన మంచి ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు 21 బహుమతులు సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

అందరి సహకారంతోనే మండలాభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ జయరామిరెడ్డి

నూజెండ్ల: ప్రభుత్వం అందించే నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా చేసేందుకు ప్రజాప్రతినిధులకు అధికారులు సహకరించాలని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.ఉమాదేవి అధ్యక్షతన గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా జయరామిరెడ్డి పాల్గొన్నారు. వేసవిలో నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కుమార్ రాజు మాట్లాడుతూ వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండలంలోని 6 రక్షిత మంచి నీటి పథకాలకు మరమ్మతులు చేయించామని చెప్పారు. ఇబ్బందులు తలెత్తితే స్థానిక సెక్రటరీ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఉపాధి హామీ ఏపీవో ఆంజనేయరాజు మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో ఫాం పాండ్స్ ఏర్పాటు చేసుకునేందుకు వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి ఎలీషా మాట్లాడుతూ ప్రతి రైతూ పంట బీమా చేయించుకోవాలన్నారు. కొందరు అధికారులు గైర్హాజరవటం, వారి బదులు సిబ్బందిని పంపటంపై ఎంపీడీవో ఉమాదేవి అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పంచాయతీ రాజ్ వ్యవస్థ కీలకం



నూజెండ్ల: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



నరసరావుపేట రూరల్: గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

నూజెండ్ల: గ్రామాభివృద్ధిలో పంచాయతీ రాజ్ వ్యవస్థ పాత్ర కీలకమని ఈఓపీఆర్డీ రబ్బానీ అన్నారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ర్యాలీ, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలోఉపాధి హామీ ఏపీవో ఆంజనేయరాజు, గ్రామ సర్పంచ్ వెంకటస్వామి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నరసరావుపేట రూరల్: గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ పేరిరెడ్డి తెలిపారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఏఈ వెంకటేశ్వర్లు, ఎస్‌బీఎం ఎంఆర్‌సీ అయ్యపరెడ్డి, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవో కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. సర్పంచ్ నాగలక్ష్మి, ఎంపీపీ తలతోటి రాణి, ఎంపీడీవో స్వరూపారాణి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్‌టెంట్ జి.రమేష్, మానిటరీ ఇన్ఫర్మేషన్ సిస్టం కన్సల్‌టెంట్ రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు. గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులు అర్పించారు.

బొల్లాపల్లి: గ్రామ పాలన వ్యవస్థ ఆర్థిక పరిపుష్టి చెందినప్పుడే దేశం ప్రగతి సాధించినట్లు అని ఎంపీపీ బత్తి రాములు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బి.మరియమ్మ, మండల పరిషత్ ఏవో వీరయ్య, అధికారులు, పంచాయతీల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యడ్లపాడు: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం యడ్లపాడు పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించబడింది. పారిశుద్ధ్య సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కారుచోల హేమ, ఎంపీటీసీ సభ్యులు కీర్తి అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ జి.హరిబాబు, ఎంపీడీవో వి.హేమలతాదేవి, పంచాయతీ కార్యదర్శి ఎ.శశికళ, వాటర్ యూజర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోపూరి రాఘవయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంబటి యామిని లక్ష్మీదేవి పేటకు గర్వకారణం

సత్కార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



అంబటి యామిని లక్ష్మీదేవిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పట్టణానికి చెందిన అంబటి యామిని లక్ష్మీదేవి సివిల్స్ ఫలితాల్లో 591వ ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌ను సాధించటం నరసరావుపేటకు గర్వకారణంగా భావిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని కొత్తబావి బజారులో నివాసం ఉండే యామిని లక్ష్మీదేవి గృహానికి వెళ్లి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఒక చిన్న కుటుంబంలో జన్మించి తండ్రి మృతి తర్వాత తల్లి, ఇతర కుటుంబ సభ్యుల తోడ్పాటుతో ఐఆర్ఎస్ సాధించటం ఎంతోమందికి స్ఫూర్తి అన్నారు. దీనిని అందరి విజయంగా భావించాలన్నారు. చాలా మంది తమ పిల్లలను డాక్టర్లు, ఇంజినీర్లుగా చేయాలని తపన పడుతుంటారని, యామిని లక్ష్మీదేవి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని సివిల్స్ సాధించవచ్చని ఒక నమ్మకాన్ని కలిగించారన్నారు. అందువలన పిల్లల ఇష్టాన్ని గమనించి చదివించాలని సూచించారు. యామిని భవిష్యత్‌లో ఐఏఎస్‌ను సాధిస్తుందనే నమ్మకం తనకు ఉందని, ఆమె విజయం సాధించాలని ఆకాంక్షించారు. డాక్టర్ గోపిరెడ్డి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఐఏఎస్ సాధించడమే లక్ష్యం

తాను ఐఏఎస్ సాధించేంత వరకు విశ్రమించబోనని ఇటీవల ప్రకటించిన సివిల్స్ ఫలితాల్లో ఐఆర్ఎస్ సాధించిన పట్టణానికి చెందిన అంబటి యామిని లక్ష్మీదేవి స్పష్టం చేశారు. ఆమె 591వ ర్యాంకుతో ఐఆర్ఎస్ సాధించటంపై బుధవారం శ్రీ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, సభ్యులు కొత్తబావి బజారులోని ఆమె గృహానికి వెళ్లి సత్కరించారు. లక్ష్మీదేవి నరసరావుపేటకే గర్వకారణం అన్నారు. సామాన్య కుటుంబ నేపథ్యం గల యామిని తన తండ్రి ఆశయాల స్ఫూర్తితో కష్టపడి దీనిని సాధించారన్నారు. ఈ సందర్భంగా యామిని మాట్లాడుతూ తన తల్లి, చెల్లి తోడ్పాటుతో సివిల్స్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అధ్యక్షుడు, న్యాయవాది శ్రీగిరిరాజు అయ్యపరాజు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి గోపాలబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

వినుకొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన వినుకొండ పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ కృష్ణలంకకు చెందిన ఇంటూరి మణిరత్నం (25) ఐటీసీ కంపెనీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా సుబాబుల్ కర్రను వేర్‌బ్రిడ్జి వద్ద లోడ్ చేసి తిరిగి వస్తుండగా నరసరావుపేట నుంచి వినుకొండ వైపు వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం అతడి బైకును వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో మణిరత్నం అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపు

నరసరావుపేట: పట్టణంలో ఆక్రమణలను తొలగిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పేర్కొన్నారు. గురువారం పల్నాడు రోడ్డులో దక్షిణం వైపున ఫుట్‌పాత్, డ్రైనేజీలను ఆక్రమించి నిర్మించిన వాటిని కృష్ణా హాస్పిటల్ నుంచి ప్రారంభించి జేసీబీతో తొలగించారు. ఈ పనులను టీపీవో సాంబయ్య పర్యవేక్షించారు. ఆక్రమణల తొలగింపు పట్టణంలో అన్నిరోడ్లలో కొనసాగుతుందన్నారు. మళ్లీ ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.